నమస్తే తెలంగాణ



# నేడు విజయ మెగా డెయిరీ ప్రారంభం

- 40 ఎకరాల్లో రూ.250 కోట్లతో నిర్మాణం
- 5 లక్షలకు పైగా లీటర్ల పాల ప్రాసెసింగ్
- లక్ష మంది పాడి రైతులకు ప్రయోజనం
- రావిర్యాలలో ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్




హైదరాబాద్, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పాల ఉత్పత్తి, ప్రాసెసింగ్ పెంపుదలే లక్ష్యంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించిన విజయ మెగా డెయిరీ ప్లాంట్ ప్రారంభానికి సిద్ధమైంది. రంగారెడ్డి జిల్లా రావిర్యాల గ్రామ (ఇమారత్ కంచ) పరిధిలోని 40 ఎకరాల విస్తీర్ణంలో రూ.250 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించారు. ఈ మెగా డెయిరీని గురువారం రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డీడీబీ) సహకారంతో రోజూ 5 లక్షల నుంచి 8 లక్షల లీటర్ల పాల ప్రాసెసింగ్ సామర్థ్యంతో దేశంలోనే అత్యాధునిక, పూర్తిస్థాయి ఆటోమిషన్ ప్రాసెసింగ్ టెక్నాలజీతో దీనిని నిర్మించారు. ఈ డెయిరీ నిర్వహణకు మొత్తంగా సోలార్ విద్యుత్తునే వినియోగించనున్నారు. సోలార్ విద్యుదుత్పత్తి వ్యవస్థతోపాటు, వ్యర్థాల వినియోగంతో విద్యుత్తును ఉత్పత్తి చేసేలా ఏర్పాట్లు కూడా చేశారు. ఈ మెగా డెయిరీ ఏర్పాటుతో రాష్ట్రంలోని సుమారు లక్ష మంది పాడి రైతులకు ప్రయోజనం కలుగనున్నది. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతోనే విజయ డెయిరీ వృద్ధిలోకి వచ్చిందని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.

### విజయ మెగా డెయిరీ ప్రత్యేకతలు

- రూ.250 కోట్లతో 40 ఎకరాల్లో అత్యాధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణం
- నిత్యం 5 లక్షల నుంచి 8 లక్షల లీటర్ల పాల ప్రాసెసింగ్, ప్యాకేజింగ్
- రోజుకు లక్ష లీటర్ల టెట్రా బ్రిక్ పాల ప్యాకెట్ల తయారీ. ప్రతినెలా 30 టన్నుల వెన్న తయారీ
- రోజుకు 10 టన్నుల నెయ్యి ఉత్పత్తి సామర్థ్యం గల యంత్ర పరికరాలు
- రోజుకు 5 వేల నుంచి 10 వేల లీటర్ల ఐస్ క్రీం తయారీ
- రోజుకు 20 టన్నుల పెరుగు ఉత్పత్తి
- రోజుకు 12 వేల లీటర్ల మజ్జిగ, లస్సీ తయారీ

## నేడు రంగారెడ్డికి కేటీఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణ): రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో గురువారం రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పర్యటించనున్నారు. ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్ నుంచి మంత్రి కేటీఆర్ బయలుదేరి వెళ్లనున్నారు. ఉదయం 8.45 గంటలకు మాదాపూర్ నాలెడ్జ్ సిటీలో గోల్డ్‌మెన్ సాచ్స్ కార్యక్రమంలో పాల్గొంటారు. 10.30 నుంచి 11 గంటలకు కొత్తూర్‌లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారు. 11.15 గంటలకు షాద్‌నగర్‌లో డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయాన్ని ప్రారంభించి, బంజారా భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం షాద్‌నగర్ మార్కెట్ యార్డులో జరిగే సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటిగంటకు రావిర్యాలలో విజయ మెగా డెయిరీని ప్రారంభిస్తారు. 2.30గంటలకు వికారాబాద్ జిల్లా కేంద్రంలో గిరిజన భవన్, రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం పట్టణంలోని బ్లాక్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగసభలో ప్రసంగిస్తారు. సాయంత్రం 5 గంటలకు కూకట్‌పల్లి నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం కేపీహెచ్‌బీలోని కేటీఆర్ పార్కులో జరిగే సభలో మంత్రి కేటీఆర్ పాల్గొంటారు.

# బెంగళూరు దయనీయం

- సమస్యలకు అడ్డాగా ఐటీ క్యాపిటల్
- రోడ్డెక్కితే ట్రాఫిక్.. ఆకాశంలో కిరాయిలు
- విద్యుత్తు కోతలతో సామాన్యుల వెతలు
- తాగునీటికి తంటాలు.. రక్షణ కరువు
- బీజేపీ, కాంగ్రెస్ పాలనలో సమస్యలకు కేరాఫ్‌గా గార్డెన్ సిటీ ఆఫ్ ఇండియా





(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): నిన్నటి నాలుగేండ్ల బీజేపీ పాలనలో, ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో కర్ణాటక కష్టాలకు కేంద్రంగా మారిపోయింది. 'సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా'గా పిలుచుకొనే బెంగళూరు పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. గార్డెన్ సిటీగా మొన్నటివరకూ ముద్దుగా పిలుచుకొన్న బెంగళూరు నగరాన్ని నేడు సమస్యలకు కేరాఫ్‌గా పిలుస్తున్నారు. రోడ్డెక్కితే ట్రాఫిక్ కష్టాలు, కాలుష్యంతో ఊపిరిపోయే దుస్థితి, విద్యుత్తు కోతలతో సామాన్యుల వెతలు, తాగునీటికి తంటాలు, భద్రత కరువు, ఆకాశాన్నంటుతున్న లివింగ్ కాస్ట్ వెరసి బెంగళూరులో ఇక ఉండబోయేది లేదని ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, సామాన్యులు చెబుతున్నారు. నరకానికి చిరునామాగా బెంగళూరు మారిపోయిందంటూ ప్రముఖులు సైతం తమ అసహనాన్ని వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

### ట్రాఫిక్ నుంచి భద్రత వరకూ అన్నీ సమస్యలే


బెంగళూరులో గత కొన్నిరోజులుగా ట్రాఫిక్ కష్టాలు తారాస్థాయికి చేరుకున్నాయి. 2-3 కిలోమీటర్ల ప్రయాణానికి గంటల సమయం పడుతున్నది. తాజాగా జరిగిన మూడు ఘటనలు బెంగళూరు ట్రాఫిక్ సమస్యకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ట్రాఫిక్‌లో చిక్కుకున్న ఓ మహిళ కూరగాయలను ఒలుచుకుంటూ వినూత్నంగా నిరసన తెలిపారు. ట్రాఫిక్‌లో వంట కూడా చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. కారులో ప్రయాణిస్తూ ఔటర్ రింగ్ రోడ్డుపై గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్న కొందరు పిజ్జాకు ఆర్డర్ ఇవ్వడం, దానిని ఆన్‌టైమ్‌లోనే డెలివరీ బాయ్ ట్రాఫిక్‌లో ఇరుక్కుని ఉన్న కారు వద్దకే వచ్చి డెలివరీ చేసిన వీడియో వైరల్‌గా మారింది. ఇక, బెంగళూరు ట్రాఫిక్‌లో చిక్కుకొన్న ఓ వ్యక్తికి అతనేదో షాపింగ్‌కు వెళ్లినట్టు 'మీ షాపింగ్ అనుభవం ఎలా ఉంది?' అంటూ గూగుల్ నుంచి నోటిఫికేషన్ వచ్చింది. ఆయన గంటల తరబడి ఓ షాపింగ్ మాల్ పక్కన ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడమే అందుకు కారణంగా తెలుస్తున్నది. గత బీజేపీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. రోడ్లు అధ్వానంగా ఉన్నట్టు మండిపడుతున్నారు. చెట్లు లేకపోవడంతో కాలుష్యం కూడా అంతకంతకూ పెరిగిపోతున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక, గంటల తరబడి నగరంలో కొనసాగుతున్న విద్యుత్తు కోతలతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ వచ్చాక విద్యుత్తు కష్టాలు మరింతగా పెరిగాయని మండిపడుతున్నారు. అయితే, మరమ్మతుల పనుల కారణంగానే విద్యుత్తు కోతలు విధిస్తున్నట్టు ప్రభుత్వం కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నది. ఇక, నగరంలోని స్మార్ట్‌సిటీ, ఎలక్ట్రానిక్ సిటీ ప్రాంతాల్లో తాగునీటి కష్టాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. వేలల్లో అద్దెలు, గృహ పన్నులను చెల్లిస్తున్నప్పటికీ కనీస అవసరాలను కూడా కార్పొరేషన్ అధికారులు తీర్చడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన నాలుగేండ్లలో క్రైమ్ రేటు కూడా పెరిగిందని, సీసీటీవీ కెమెరాలు అలంకారప్రాయంగానే ఉన్నాయని, మెజారిటీ కెమెరాలు పనిచేయట్లేదని పలువురు చెబుతున్నారు.

### ప్రముఖుల విమర్శలు

దక్షిణాఫ్రికాకు చెందిన ప్రముఖ కమెడియన్ ట్రెవోర్ నోహ్ ఇటీవల బెంగళూరులో ఓ షోలో పాల్గొనాల్సి ఉన్నది. అయితే, నగరంలోని ట్రాఫిక్, కనీస సౌకర్యాలకు దూరంగా టెంట్‌తో ఏర్పాటుచేసిన వేదిక, స్టేజీ వెనుక కుక్కలు హల్‌చల్ చేయడం వెరసి ఆయన తన షోను క్యాన్సల్ చేసుకొన్నారు. ఇలాంటి వసతులలేమి ఉన్న ప్రాంతంలో షోను ఎలా చేయగలమని సోషల్‌మీడియాలో ప్రశ్నించారు. దీనిపై బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా స్పందించారు. బెంగళూరులోని సమస్యలు నోహ్ కామెడీ షోలకు మంచి కంటెంట్‌గా మారొచ్చని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొనకపోతే, ప్రముఖులు ఎవరూ నగరానికి రాబోరని హెచ్చరించారు. బెంగళూరులో ఆర్థిక మాంద్యం పరిస్థితులు తలెత్తితే గానీ, ట్రాఫిక్ సమస్యలు పరిష్కారం కాబోవేమో అంటూ అధికారుల వైఖరిని నిరసిస్తూ ఓ సీఈవో ట్వీట్ చేశారు.

### భాగ్యనగరం భళా

సమస్యల బెంగళూరుతో విసిగివేసారిన వారికి హైదరాబాద్ ప్రత్యామ్నాయంగా మారుతున్నది. విద్యార్థులు, ఉద్యోగులు ఎక్కువమంది భాగ్యనగరాన్ని తమ గమ్యస్థానంగా మార్చుకొంటున్నారు. విశాలమైన రోడ్లు, వంతెనలు, స్కైవేలు, ఫుట్‌పాత్‌లతో నగరంలో ప్రయాణం సాఫీగా సాగుతున్నదని, ట్రాఫిక్ కష్టాలు లేవంటూ ఈజ్ ఆఫ్ మూవింగ్ ఇండెక్స్ 2022 నివేదిక వెల్లడించింది. నగరంలో 24 గంటలపాటు విద్యుత్తు సరఫరా, పచ్చని చెట్లతో పరిశుభ్రమైన వాతావరణం, ఇంటింటికీ తాగునీటి సరఫరా, అందుబాటు ధరల్లో అద్దెలు, 4,40,299 సీసీటీవీ కెమెరాలతో పటిష్టమైన భద్రత ఉండటంతో ఉద్యోగులు, విద్యార్థులు, సామాన్యులు తమ నివాసానికి హైదరాబాద్‌ను ప్రథమ ఆప్షన్‌గా ఎన్నుకొంటున్నారు. కాగా, హైదరాబాద్‌లో సదుపాయాలు, అభివృద్ధిపై నీతిఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్, బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా, ఇండియన్ స్టాఫింగ్ ఫెడరేషన్ ఈడీ సుచితా దత్త, ప్రముఖ నటుడు రజినీకాంత్, బాలీవుడ్ నటి సోనాల్ చౌహాన్, ఎస్బీఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ అమిత్ జింగ్రాన్ తదితరులు ఇప్పటికే ప్రశంసల వర్షం కురిపించడం తెలిసిందే.



# మెరుగైన ఫిట్‌మెంట్ ఇచ్చేలా సిఫారసు చేయాలి

- నూతన పీఆర్సీ కమిటీకి టీఎన్జీవో నేతల విజ్ఞప్తి



శివశంకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, ఇతర నాయకులు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆకాంక్షలకనుగుణంగా వేతన సవరణను సిఫారసు చేయాలని పీఆర్సీ కమిటీని టీఎన్జీవో కేంద్ర సంఘం కోరింది. నూతన పీఆర్సీ కమిటీ చైర్మన్‌గా శివశంకర్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం సచివాలయంలో ఆయనను టీఎన్జీవో నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పెరుగుతున్న నిత్యావసర ధరల దృష్ట్యా.. మెరుగైన ఫిట్‌మెంట్ ఫార్ములాను సిఫారసు చేయాలని కోరారు. గడువులోపు నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని విజ్ఞప్తిచేశారు. చైర్మన్‌ను కలిసిన వారిలో టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకట్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ హుస్సేని, విక్రమ్, లక్ష్మణ్, శ్రీకాంత్, హరికృష్ణ, శ్రావణ్, కిరణ్, నర్సింహులు, గౌస్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, రాజ్‌కుమార్, కొండల్‌రెడ్డి, శైలజ, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఐఆర్ పెంచాలని వినతి

ఉద్యోగులకు ప్రభుత్వం ప్రకటించిన మధ్యంతర భృతిని పెంచాలని టీఎన్జీవో నేతలు మామిళ్ల రాజేందర్, మారం జగదీశ్వర్, ముత్యాల సత్యనారాయణగౌడ్ బుధవారం మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈహెచ్‌ఎస్ సౌకర్యాన్ని కల్పించాలని, రెండు డీఏలను మంజూరుచేయాలని, సీపీఎస్‌ను రద్దుచేసి, ఓపీఎస్‌ను అమలుచేయాలని కోరారు.

## లాలూ, కుటుంబ సభ్యులకు బెయిల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: ల్యాండ్ ఫర్ జాబ్ కేసులో బీహార్ మాజీ సీఎం, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన భార్య రబ్రీదేవి, కుమారుడు, బీహార్ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్‌కు బుధవారం బెయిల్ మంజూరు అయ్యింది. సీబీఐ సమన్లతో ప్రత్యేక కోర్టు ముందు హాజరైన నిందితులు ఒక్కొక్కరు 50 వేల విలువైన బాండ్‌ను సమర్పించాలని ప్రత్యేక జడ్జి గీతాంజలి గోయర్ ఆదేశిస్తూ బెయిల్ మంజూరు చేశారు. వీరి బెయిల్‌కు సీబీఐ ఎలాంటి అభ్యంతరం తెలియజేయలేదు. రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో లాలూ, ఆయన కుటుంబ సభ్యులు భూమి ఇస్తే ఉద్యోగాలిప్పిస్తామని పలువురు నిరుద్యోగులను మోసం చేశారన్న ఆరోపణలపై సీబీఐ వీరిపై కేసు దాఖలు చేసింది.

## అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్‌కు ఉద్వాసన

- కెవిన్ మెకార్థీని పదవి నుంచి దించేసిన రిపబ్లికన్లు
- నెగ్గిన అవిశ్వాస తీర్మానం
- స్పీకర్‌ను పదవీచ్యుతుడిని చేయడం చరిత్రలో తొలిసారి

వాషింగ్టన్, అక్టోబర్ 4: అమెరికా దిగువ సభ అయిన ప్రతినిధుల సభలో చరిత్రలో ఎన్నడూ లేని పరిణామం చోటు చేసుకుంది. స్పీకర్‌గా వ్యవహరిస్తున్న విపక్ష రిపబ్లికన్ పార్టీకి చెందిన కెవిన్ మెకార్థీని పదవీచ్యుతిడిని చేశారు. ఇటీవల దేశంలో ఏర్పడిన షట్‌డౌన్ సంక్షోభంలో ఆయన అధికార డెమోక్రాట్లకు బాహాటంగానే మద్దతు పలకడం రిపబ్లికన్ల ఆగ్రహానికి కారణమైంది. దీంతో మాట్ గేట్జ్ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గం ఆయనకు వ్యతిరేకంగా పెట్టిన అవిశ్వాస తీర్మానం 216-210తో నెగ్గడంతో మెగార్థీ స్పీకర్ పదవి నుంచి దిగిపోక తప్పలేదు. తొలుత దీనికి నిరాకరించిన ఏడుగురు రిపబ్లికన్ సభ్యులు చివరకు మద్దతుగా నిలవడంతో తీర్మానం నెగ్గింది. సభ కొత్త స్పీకర్‌ను ఎన్నుకోవాల్సి ఉందని సీఎన్ఎన్ తెలిపింది.

## 'బెన్ను' భూమిని ఢీకొట్టొచ్చు!: నాసా

వాషింగ్టన్ డీసీ, అక్టోబర్ 4: అంతరిక్షంలో ప్రతి ఆరేండ్లకోమారు భూమికి అత్యంత సమీపంగా వచ్చే ఆస్టరాయిడ్ 'బెన్ను', 2182లో భూమిని ఢీకొనే ప్రమాదముందని నాసా సైంటిస్టులు అంచనావేశారు. 1610 అడుగుల పొడవున్న 'బెన్ను' ఒకవేళ భూమిని ఢీకొంటే, అప్పుడు వెలువడే శక్తి 24 అణుబాంబు పేలుళ్లకు సమానమని, 22 మెగాటన్నుల శక్తి విడుదలవుతుందని నాసా వివరించింది. '2182, సెప్టెంబర్ 24న భూమికి అత్యంత సమీపంగా వెళ్లే సమయంలో ఇది జరిగేందుకు 0.037శాతం అవకాశముంది. అదుపు తప్పి భూకక్ష్యలోకి వచ్చాక, భూగురుత్వాకర్షణకు లోనయ్యే ప్రమాదముంది. 1999, 2005, 2011లో భూమికి 46.5 లక్షల మైళ్ల దూరం నుంచి వెళ్లింది' అని నాసా తెలిపింది. ఆస్టరాయిడ్ బెన్నును నాసా 1999లో కనుగొన్నది.

